కాంగ్రెస్‌ను ఆ గ్రామాలే గెలిపించాయా ?

బీఆర్ఎస్ మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు గయాజ్

వికారాబాద్, జనవరి 28 : కాంగ్రెస్ ప్రభుత్వం రోజుకో మాట మారుస్తూ...ప్రజలను మభ్య పెట్టి పబ్బం గడుపుకొంటున్నదని బీఆర్ఎస్ వికారాబాద్ మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎస్.డి గయాజ్ మంగళవారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం మండలానికో గ్రామాన్ని ఎంపిక చేసి సంక్షేమ పథకాలు అమలు చేయడం ఏంటని ?.. సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టిన ఆయా గ్రామాలు మాత్రమే ఓట్లు వేస్తే కాంగ్రెస్ గెలిచిందా అని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి పాలన చూసి ప్రజలు నవ్వుకునే రోజులు వచ్చాయని తెలిపారు. జనవరి 26 న రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు వస్తున్నాయని అనుకున్న ప్రజల ఆశలు నీరుగారయన్నారు. సీఎం కేసీఆర్ హయాంలో రైతుల ఖాతాల్లో రైతు బంధు టంగు.. టంగు మని వచ్చేదని, కాంగ్రెస్ హయాంలో కండ్లు కాయలు కాచేలా ఎదురు చూస్తున్నా ఖాతాల్లో మాత్రం డబ్బులు జమ కావడం లేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే హామీలు అన్ని అమలు చేస్తామని చేసిన సీఎం రేవంత్ రెడ్డి, ఏడాది దాటిన హామీలు అమలు కావడం లేదని మండిపడ్డారు. కొన్ని రోజులకే కాంగ్రెస్ పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ప్రారంభం అయ్యిందన్నారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీని గెలిపించింది ప్రజలకు మంచి పాలన అందించేందుకని, ఇకనైనా ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేయకుండా హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. హామీలు అమలు చేయకపోతే బీఆర్ఎస్ ప్రజల తరపున పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి

కొడంగల్: కంట్రీబ్యూటరీ పెన్షన్ స్కీం కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

దోమ: తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న పీఆర్టీయూ సభ్యులు

కొడంగల్, జనవరి 28: సీపీఎస్ అంతంతోనే ఉద్యోగి భవిష్యత్తు ఆధారపడి ఉందని టీజీసీపీఎస్ఈయూ వికారాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇల్లూరి క్రాంతికుమార్ అన్నారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో తెలంగాణ కంట్రీబ్యూటరీ పెన్షన్ స్కీం (టీజీసీపీఎస్ఈయూ) కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎస్‌ను అంతం చేసి పాత పెన్షన్ విధానం వచ్చే వరకు కలిసి కట్టుగా ఉద్యమిద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు గోపీనాథ్, ఏసురత్నం, కేసీ వెంకటేశ్, రవికుమార్‌లతో పాటు సీపీఎస్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దోమ: సీపీఎస్‌ను రద్దు చేయాలని మంగళవారం పీఆర్టీయూ టీఎస్ యూనియన్ సభ్యులు తహసీల్దార్ పురుషోత్తంకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు కేశవులు మాట్లాడుతూ ఈ విధానం వలన ఉపాధ్యాయులకు పదవీ విరమణ తరువాత పెన్షన్లు రాక భయాందోళనకు గురవుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన విధంగా సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించినట్లు తెలిపారు. ఇప్పటికే కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలైన రాజస్థాన్, జార్ఖండ్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాలో సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్ ధానాన్ని అమలు చేసిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయ్య, మండల గౌరవ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌సింగ్,సభ్యులు వేణుగోపాల్, వెంకట్ రాములు, నర్సింహులు, యాదగిరిగౌడ్, సంగీత, కల్పన, పల్లవి, షాయిన్‌బేగం తదితరులు పాల్గొన్నారు.

హైడ్రాను కోర్టుకీడుస్తాం..

సమావేశంలో మాట్లాడుతున్న మల్లారెడ్డి, సంపత్ రెడ్డి, రాజీ రెడ్డి

ఖైరతాబాద్, జనవరి 28 : అకారణంగా తమ ఆస్తులను ధ్వంసం చేసిన హైడ్రాను కోర్టుకీడుస్తానని, పరువునష్టం దావా వేస్తానని విద్యాసంస్థల అధినేత నల్ల మల్లారెడ్డి అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైడ్రా అధికారులు ఏకపక్షంగా తమ గోడు వినకుండా పట్టా భూముల్లో నిర్మించుకున్న తమ ఇంటి ప్రహరీతో పాటు తమ వ్యాసాయ భూమి చుట్టూ వేసిన ఫెన్సింగ్‌ను కూల్చివేసి కోట్లాది రూపాయల నష్టం చేశారన్నారు. అన్ని పత్రాలు, అనుమతులు చూపించినా వినకుండా హైడ్రా కమిషనర్‌ను ప్రశ్నిస్తే నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారన్నారు. ఈ విషయం కోర్టును ఆశ్రయించామని, తమ పరువుకు భంగం కలిగించేలా ప్రవర్తించారని, వారిపై పరువు నష్టం దావా కూడా వేస్తానన్నారు. దివ్యనగర్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సంపత్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎండీ హైదర్, సలహాదారుడు రాజి రెడ్డి మాట్లాడుతూ మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ మండలం పోచారం మున్సిపాలిటీలోని కాచవాణి సింగారంలో సర్వే నంబరు 44, 45, 47, 48, 52, 64, కొర్రెముల గ్రామంలోని సర్వే నంబరు 719, 720లలోని సుమారు 250 ఎకరాల స్థలంలో 11 లేఅవుట్లలో 3,500 మంది వివిధ ఉద్యోగాలు చేస్తూ ప్లాట్లు కొనుక్కున్నామన్నారు. హైడ్రా సిబ్బంది వచ్చి పదుల సంఖ్యలో బుల్డోజర్లు తీసుకువచ్చి నాలుగు కిలోమీటర్ల కాంపౌండ్ వాల్, రోడ్డుపై ఉన్న డివైడర్లు, ఫెన్సింగ్‌ను కూల్చివేశారన్నారు. సమావేశంలో దివ్యనగర్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు ఉషా కాంత్ తదితరులు పాల్గొన్నారు.

■ సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత..



కులకచర్ల, జనవరి 28 : చౌడాపూర్ మండల పరిధిలోని చిన్న మేగ్యానాయక్‌తండాకు చెందిన లాలమ్మకు రూ. 58వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును మంగళవారం కాంగ్రెస్ పార్టీ చౌడాపూర్ మండల అధ్యక్షుడు ఎల్పటి అశోక్‌కుమార్ అందించారు. కార్యక్రమంలో నాయకులు శేఖర్, మండల వర్కింగ్ ప్రసిడెంట్ సలీమ్, సీనియర్ నాయకులు వెంకటయ్య, మండల యూత్ అధ్యక్షుడు రాము, యువజన నాయకులు విజయ్, పాండు, శ్రీను, సురేశ్ పాల్గొన్నారు.

■ ఆత్మీయ సన్మానం..

పరిగి, జనవరి 28: పరిగి మున్సిపాలిటీలోని నాల్లో వార్డు కౌన్సిలర్‌గా పనిచేసిన వారాల రవీంద్ర పదవీకాలం ఇటీవల ముగియడంతో మంగళవారం పట్టణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వార్డు పరిధిలోని ఆయా కాలనీల వారు ఘనంగా సన్మానించారు. ఐదేండ్ల కాలంలో వార్డు పరిధిలో అభివృద్ధి పనులు చేయించడం ద్వారా చక్కటి సేవలు అందించారని వారు అభినందించారు. కార్యక్రమంలో టీచర్స్‌కాలనీ, వెంకటేశ్వర కాలనీ, అయ్యప్ప కాలనీ, మందుల కాలనీ, రామసేన యువజన సంఘం సభ్యులు, అమృతాంజనేయ స్వామి ఆలయ కమిటీ సభ్యులు పాల్గొని వారాల రవీంద్రను ఘనంగా సన్మానించారు.

■ ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఎన్నిక

దోమ, జనవరి 28 : మండల పరిధిలోని గుండాల గ్రామంలో ఎమ్మార్పీఎస్ నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పోతిరెడ్డిపల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా వెంకటయ్య, ఉపాధ్యక్షులుగా దస్తయ్య, కృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మండల అధ్యక్షుడు బందెయ్య తెలిపారు. అనంతరం ఎన్నికైన కమిటీ సభ్యులకు నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు వెంకటయ్య, ప్రధానకార్యదర్శి దస్తయ్య, రామన్న మాదిగ యువకులు తదితరులు పాల్గొన్నారు.

■ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

మర్పల్లి, జనవరి 28: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని మోమిన్‌పేట ఎక్సైజ్ సీఐ సహదేవుడు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠ శాలలో విద్యార్థులకు గంజాయి, డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు.. ఎక్కువైన గంజాయి, డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు తెలిస్తే సమాచారం అందించాలన్నారు.. అనంత రం విద్యార్థులతో పతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రమీల, ఎస్సై రేఖ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు..

■ బాధిత కుటుంబానికి పరామర్శ..

కులకచర్ల, జనవరి 28: ఇల్లు కూలిపోయిన బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని పీఎన్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్ కోరారు. మంగళవారం మండల పరిధిలోని ఘనాపూర్ గ్రామంలో ఎరుకలి రాములు, చంద్రయ్య ఇల్లు కూలి పోవడంతో వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇద్దరన్నదమ్ములు ఒకే ఇంట్లో ఉంటున్నారని, సోమవారం వారు కూలికి వెళ్లిన సమయంలో ఇల్లు కూలడంతో ప్రమాదం తప్పిందని తెలిపారు.కార్యక్రమంలో బాధిత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

ఇరువర్గాల గొడవ ..

- కేసు నమోదు

పెద్దేముల్, జనవరి 28 : మండల పరిధిలోని గాజీపూర్ గ్రామంలో సోమవారం గ్రామ దేవతకు బోనాల పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఆడపడుచులు అమ్మవారి ఆలయం చుట్టు బోనాలతో ప్రదక్షిణ చేస్తుండగా బోనాల ముందు అదే గ్రామానికి చెందిన యువకులు డ్యాన్స్‌లు చేస్తూ సమయం వృథా చేస్తు న్నారని, ఆడపడుచులకు బోనాలు తలపై బరువెక్కుతున్నాయని మరో వ్యక్తి వారికి తెలిపాడు. అదే సమయంలో ఇరువురి మధ్య గొడవలు ప్రారంభమై అవి కాస్త ఒకరిపై ఒకరు దాడి చేసుకునే వరకు వెళ్లింది. ఇరువర్గాలు దాడి చేసుకొని ఒకరిపై ఒకరు పెద్దేముల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. బుద్దారం చంద్రప్ప, జనముల వేణుగోపాల్‌పై ఇరువర్గాలపై ఫిర్యాదు చేసుకున్నారు. ఇరువురి ఫిర్యాదులు స్వీకరించిన పెద్దేముల్ ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

తాండూరు రోడ్లకు మహర్దశ

తాండూరు,జనవరి 28 : తాండూరు రోడ్ల కు త్వరలోనే మహర్దశ చేకూరనుంది. తాండూరు రోడ్ల నిర్మాణ, మరమ్మతుల కోసం రూ15 కోట్ల 20 లక్షలు మంజూరైనట్లు మంగళవా రం తాండూరు క్యాంపు కార్యాలయం ప్రకటనలో తెలిపింది. స్థానిక ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో ఆర్థిక శాఖ అనుమతితో తాండూరు నియోజకవర్గ పరిధిలోని పలు రోడ్ల మరమ్మతులకు జీవో నెం. 59 పీఆర్‌అండ్ ఆర్‌డీ రహదారుల నిర్మాణానికి ఎమ్మార్ఆర్ గ్రాంట్స్ ద్వా రా విడుదలైన నిధులను వెచ్చించనున్నారు.

ఏఈవోను నియమించాలి

మర్పల్లి, జనవరి 28: మండలంలోని కల్ ఖోడా రైతు వేదికలో ఏఈవో లేకపోవడం తో కొన్ని రోజులుగా రైతులు ఇబ్బందులు పడుతున్నారు.. క్లస్టర్ కింద వచ్చే దామ స్తాపూర్, షాపూర్, కల్ ఖోడా, పెద్దాపూర్, రావులపల్లి, తిమ్మాపూర్, కుడుగుంట గ్రా మాల రైతులు వ్యవసాయం కు సంబం ధించి వివరాలు తెలుసుకోవాలన్న, కొత్తగా వచ్చిన రైతు పట్టాపాస్ బుక్కులతో రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలన్న ఇబ్బందులు పడుతున్నామని ఆయా గ్రామాల రైతులు పేర్కొంటున్నారు. సంబంధిత అధి కారులు ఏఈవోను నియమించాలని కోరుతున్నారు.. ఏవో శ్రీకాంత్‌ను అడుగగా పట్లూర్ క్లస్టర్ ప్రశాంత్‌కు ఇన్‌చార్జిగా అదనపు బాధ్యతలు ఇచ్చామని రెండు క్లస్టర్లలో పనిక్కువైందని కల్ ఖోడా క్లస్టర్‌కు ఏఈవోను నియమించాలని పై అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

'గాంధీ'కి ఉత్తమ బ్లడ్ బ్యాంక్ అవార్డు

బన్సీలాల్‌పేట్, జనవరి 28 : తెలంగాణ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ద్వారా గాంధీ దవాఖాన బ్లడ్ బ్యాంక్ ఉత్తమ బ్లడ్ బ్యాంక్‌గా అవార్డు అందుకున్నదని సూపరింటెండెంట్ డాక్టర్ నీహెచ్ఎన్.రాజకుమారి తెలిపారు. ఈ మేరకు ఆర్ఎంఓ డాక్టర్ శేషాద్రితో కలిసి ఆమె మంగళవారం బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జి డాక్టర్ సరిత, సిబ్బందిని అభినందించారు. గతేడాది కాలంలో 52 రక్తదాన శిబిరాలను నిర్వహించి, 14 వేల యూనిట్ల రక్తాన్ని సేకరించి నిరుపేద రోగులకు అందించినట్లు ఆమె తెలిపారు.

రేపు జీహెచ్ఎంసీ సర్వసభ్య సమావేశం

సిటీబ్యూరో, జనవరి 28 (నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన ఈ నెల 30న సర్వసభ్య సమావేశం జరగనుంది. ఈ మేరకు జీహెచ్ఎంసీ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. కౌన్సిల్ సందర్భంగా వివిధ పార్టీల సభ్యుల నుంచి 125 ప్రశ్నలు రాగా..అందులో 19 ప్రశ్నలను ఎంపిక చేశారు. వీటిలో పారిశుధ్యం, టౌన్‌ప్లానింగ్, అకౌంట్స్, కాంట్రాక్టర్ల బిల్లుల చెల్లింపులు , ఎస్టేట్ విభాగాల ప్రశ్నలపై హాట్ హాట్‌గా చర్చ జరగనుంది. కాగా ఏడాది కాలంగా పేరుకుపోయిన సమస్యలపై అధికార పార్టీని నిలదీసేందుకు బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు సిద్ధమవుతున్నారు. ప్రతి మూడు నెలలకోసారి జరగాల్సిన సర్వసభ్య సమావేశం (జనరల్ బాడీ మీటింగ్) జరగాల్సి ఉంది. గత జూలై 6వ తేదీన జరిగిన 9వ పాలకమండలి (సర్వసభ్య సమావేశం) అక్టోబరులో జరపాల్సి ఉంది. కానీ ఐదు నెలలు గడిచిన సర్వసభ్య సమావేశం నిర్వహించేందుకు కమిషనర్, మేయర్ సిద్ధపడ లేదు. స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆమోదించిన ఆర్థిక సంవత్సరం (2025-26)కు సంబంధించిన రూ.8440 కోట్ల బడ్జెట్‌పై కౌన్సిల్ సమావేశంలో ప్రత్యేక చర్చ జరగనుంది.

లైంగికదాడి.. 20ఏండ్ల జైలు

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, జనవరి 28 (నమస్తే తెలంగాణ): మహంకాళి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన బాలికపై లైంగిక దాడి కేసులో నిందితుడు లింగాల దీపక్ (32)కు 20 ఏండ్ల జైలుశిక్షతోపాటు రూ.20వేల జరిమానా విధిస్తూ ప్రత్యేక పోక్సో కోర్టు జడ్జి పుష్పలత మంగళవారం తీర్పు ప్రకటించారు. అలాగే.. బాధిత బాలికకు రూ.5లక్షల నష్టపరిహారం చెల్లించాలని పేర్కొన్నారు. జరిమానా చెల్లించని సమక్షంలో అదనంగా జైలుశిక్ష అనుభవించాల్సి ఉంటుందని తెలిపారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రతాప్‌రెడ్డి కథనం ప్రకారం.. మహంకాళి పోలీస్ స్టేషన్ పరిధిలో నివాసం ఉండే బాలికను నిందితుడు లింగాల దీపక్ బలవంతంగా పక్కింట్లోకి తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడగా.. 2023లో బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. విచారణ చేపట్టిన అధికారి కె.పరశురామ్ బాలిక వాంగ్మూలాన్ని నమోదు చేసి కేసు నమోదు చేశారు. లీగల్ సపోర్టు ఆఫీసర్ టి.కల్పన బాలికపై జరిగిన లైంగికదాడి వివరాల్ని సేకరించి, సాక్షాన్ని కోర్టుకు సమర్పించే విధంగా బాలికను ప్రోత్సహించారు. కోర్టు జవాన్ సాయికుమార్ సాక్షులను సోమవారం కోర్టు ఎదుట ప్రవేశపెట్టడంతో సుదీర్ఘ విచారణ చేపట్టిన కోర్టు నిందితుడు నేరం చేసినట్టు రుజువుకావడంతో శిక్షను ఖరారు చేసింది.

ఆటోలో దోపిడీకి యత్నం

పోలీసుల అదుపులో ఇద్దరు

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 28: ఆటో ఎక్కిన వ్యక్తిపై దోపిడీకి పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను లాలాగూడ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 2022లో జరిగిన ఒక కేసులో నిందితుడిగా ఉన్న ఒంగోలుకు చెందిన బోళ్ల రామకృష్ణ (25) కోర్టుకు హాజరయ్యేందుకు సోమవారం మల్కాజిగిరి కోర్టుకు వచ్చాడు. తిరిగి అర్ధరాత్రి దాటిన తరువాత సుమారు ఒంటి గంటకు ఎల్‌బీనగర్ వెళ్లేందుకు ఆటో ఎక్కాడు. ఆటో నడిపిస్తున్న చంద్రకిరణ్ (28)తో పాటు ఆటోలో అతడి స్నేహితుడు మణికంఠ (23) సైతం ఉన్నాడు. కొంత దూరం వెళ్లిన తరువాత రామకృష్ణ జేబులో ఉన్న సెల్‌ఫోన్‌తో పాటు రూ.8,500 నగదును లాక్కున్నారు. దీనిని ప్రతిఘటించిన రామకృష్ణపై దాడికి పాల్పడ్డారు. ఈ క్రమంలో లాలాపేట ఫ్లైఓవర్‌పై నెమ్మదిగా వెళ్తున్న ఆటోను అక్కడే పెట్రోలింగ్ విధుల్లో ఉన్న రాజశేఖర్, మహేశ్‌లు పరిశీలించారు. ఆటోలో ఏదో గొడవ జరుగుతుందని గ్రహించి, వెంటనే ఆపి ఆరా తీశారు. వారిని వెంటనే లాలాగూడ పోలీస్ స్టేషన్‌కు తరలించి, నిందితులపై కేసు నమోదు చేశారు. వారినుంచి సెల్‌ఫోన్‌తో పాటు రూ.8,500 నగదును స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల విచారణలో మణికంఠ 2017 నుంచి ఇప్పటి వరకు వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఆరు చోరీ కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు తెలిసింది. పెట్రోలింగ్ సిబ్బంది పోలీసు అధికారులు అభినందించారు.

అది పులి కాదు అడవి పిల్లి

యాలాల, జనవరి 28: యాలాల మండల పరిధిలోని జక్కెపల్లి గ్రామ శివారు ప్రాంతంలో చిరుత పులి అడుగు జాడలు కనిపించాయని మంగళవారం ఉదయం నుంచి స్థానికులు భయాందోళనలకు గుర య్యారు. సమాచారం అందుకొన్న ధారూర్ రేంజ్ ఆఫీసర్ రాజేందర్ ఆదేశాల మేరకు ఫారెస్ట్ అధికారులు బీట్ ఆఫీసర్ కాశన్న, వాచర్ శ్రీధర్, సెక్షన్ ఆఫీసర్ శంకర్ సంఘటనా స్థలానికి చేరుకొని అది పులి కాదని అడవి పిల్లి అడుగులని ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ సందర్భంగా ధారూర్ రేంజ్ ఆఫీసర్ రాజేందర్ మాట్లాడుతూ... జక్కెపల్లి పరిసర ప్రాంతాలు పులి నివసించే దట్టమైన అడవి కాదన్నారు. గ్రామ ప్రజలు పొలాల వద్ద జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎవరికైనా ఆనవాళ్లు కని పిస్తే వెంటనే 8639662198 నెంబర్‌కు సమాచారం అందించాలన్నారు.

నేరస్తుడికి జైలు శిక్ష

కొడంగల్, జనవరి 28: కొడంగల్ పోస్ట్ ఆఫీస్‌లో పది సంవత్సరాల క్రితం జరిగిన డబ్బు దుర్వినియోగంపై గోపాలకృష్ణపై అప్పట్లో కేసు నమోదైంది. మంగళవారం స్థానిక కోర్టు న్యాయమూర్తి శ్రీరామ్ రెండు సంవత్సరాల జైలు, రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పును వెల్లడించినట్లు ఎస్ఐ సత్యనారాయణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పోస్టాఫీసులో ప్రజలు డిపాజిట్ చేసిన డబ్బులు అకౌంట్‌లో జమ కోసం 23.07.2014 నుంచి 24.07.2014 వరకు రెండు రోజుల బ్రాంచి ఆఫీస్ అకౌంట్ పేమెంట్స్ రాకపోవడంతో డబ్బుల విషయమై నవీన్‌కుమార్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోస్ట్ మెయిల్ సర్వీసెస్ అధికారులు బ్రాంచి ఆఫీస్‌లో చేసినట్లు తెలిపారు. ఇందులో రూ.74,340లకు సంబంధించి ఎటువంటి లావాదేవీలు లేవు, ఈ విషయమై బీపీఎం గోపాలకృష్ణ ఎటువంటి లెక్కలు లేవని చెప్పడం జరిగిందని, సొంత ఖర్చుల కోసం వాడుకున్నట్లు పేర్కొన్నట్లు తెలిపారు. ఇందుకు గాను అన్ని డాక్యూమెంట్‌లు సీజ్ చేసి డిపార్ట్‌మెంటల్ ఎంక్వయిరీ చేసి అతనిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఆ తరువాత ఎస్ఐ సత్యనారాయణరెడ్డి నేరాభియోగపత్రంను కోర్టులో దాఖలు చేయగా తుది తీర్పును వెల్లడించినట్లు తెలిపారు.

రాష్ట్ర ఈఎస్ఐ కార్పొరేషన్ ఏర్పాటుపై నిరసన

బన్సీలాల్‌పేట్, జనవరి 28 : ఈఎస్ఐ దవాఖానలు, డిస్పెన్సరీల ద్వారా 20 లక్షల మంది కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న బీమా వైద్య సేవల శాఖను మూసివేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలసి కుట్ర పూరితంగా కార్పొరేషన్ ఏర్పాటు చేయడానికి చేస్తున్న ప్రయత్నాలను తాము వ్యతిరేకిస్తున్నామని టీఎన్జీవో బీమా వైద్య సేవల శాఖ (ఈఎస్ఐ) డైరెక్టరేట్ యూనిట్ నాయకులు అన్నారు. మంగళవారం డైరెక్టరేట్ కార్యాలయం వద్ద ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలను ధరించి నిరసన వ్యక్తం చేశారు. డైరెక్టరేట్ సిబ్బందికి తెలియకుండా రహస్యంగా ప్రభుత్వం రాష్ట్ర కార్పొరేషన్ ఏర్పాటుకు ప్రతిపాదించడం దుర్మార్గపు చర్య అని నగర సంయుక్త కార్యదర్శి అపరంజినీ, డీఐఎంఎస్ యూనిట్ వ్యవస్థాపక అధ్యక్షుడు వీరన్న గౌడ్, యూనిట్ ప్రస్తుత అధ్యక్షుడు ప్రవీణ్ అన్నారు.

శివారు ప్రాంతాల్లో బీటీ రోడ్లు

సిటీబ్యూరో, జనవరి 28(నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో మెరుగైన రవాణా, మౌలిక సదుపాయాల కల్పనపై ఎట్టకేలకు హెచ్ఎండీఏ అధికారులు దృష్టి సారించారు. శివారు ప్రాంతాల్లో బీటీ రోడ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టారు. ఔటర్ రింగు రోడ్డు సర్వీస్ లైన్లకు సులభంగా చేరుకునేలా రవాణా సౌకర్యాలను కల్పిస్తున్నారు. రూ. 14.5 కోట్ల అంచనా వ్యయంతో శివారు ప్రాంతాల్లో బీటీ రోడ్ల నిర్మాణం చేయనున్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని జవహర్ నగర్ పరిధిలో దమ్మాయిగూడ చౌరస్తా నుంచి తిమ్మాయిపల్లి చౌరస్తా మీదుగా, చెన్నాపురం, డెంటల్ కాలేజీ మార్గానికి మరమ్మతులు చేయనున్నారు. నాగారం మున్సిపాలిటీ పరిధిలో దయారాకుంట నుంచి కోమటికుంటకు సీవరేజీ మళ్లించేందుకు వీలుగా బాక్స్ డ్రైన్ల నిర్మాణం, తూంకుంట ప్రధాన జంక్షన్ నుంచి మందాయిపల్లి గ్రామ పరిధి వరకు బీటీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టనున్నారు.

కెనరా క్రెస్ట్‌తో బ్యాంకింగ్ సేవలు

సిటీబ్యూరో, జనవరి 28(నమస్తే తెలంగాణ) : హై నెట్ వర్త్ కలిగిన వ్యక్తులకు మెరుగైన బ్యాంకింగ్ సేవలు అందించేందుకు కెనరా బ్యాంక్ దేశంలోని తొలిసారిగా ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించింది. కెనరా క్రెస్ట్ పేరిట బ్యాంకింగ్ సేవలను కలిగించేందుకు ఏర్పాటు చేసింది. క్రెస్ట్, క్రెస్ట్ ప్లస్ సెగ్మంట్లలో రూ. 10లక్షల నుంచి 50లక్షల లోపు, రూ. 50లక్షలకు పైగా డబ్బులు కలిగిన ఖాతాదారులకు మెరుగైన సేవలను అందించనున్నారు. కెనరా క్రెస్ట్ ద్వారా ప్రత్యేక సేవింగ్ ఖాతాతోపాటు, ప్రత్యేక రిలేషన్‌షిప్ మేనేజర్‌తోపాటు, ప్రీమియం డైనింగ్ ఆఫర్లు, ఫిట్‌పాస్ ప్రో మ్యాక్స్ మెంబర్‌షిప్, లగ్జరీ హోటల్స్, ప్రాధాన్యత ప్రకారం బ్యాంకింగ్ సేవలను అందుతాయని కెనరా బ్యాంక్ విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది.

ఆపద మిత్రకు దరఖాస్తుల ఆహ్వానం

సిటీబ్యూరో, జనవరి 28 (నమస్తే తెలంగాణ) : ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనేలా భూకంపాలు, అగ్ని, తుఫాన్లు తదితర రెస్క్యూ ఆపరేషన్‌లపై ఆపద మిత్ర ద్వారా అవగాహన పొందేందుకు యువత నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు హైదరాబాద్ అనదనపు కలెక్టర్ ముకుందరెడ్డి తెలిపారు. స్వచ్ఛందంగా సేవ చేయడానికి ఆస క్తి ఉన్న వాళ్లు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అభ్యర్థులు 18 ఏండ్ల వైబడిన వారై ఉండాలని సూచించారు.

పకడ్బందీగా సైబర్ నేరాలను అడ్డుకోవాలి

పోలీసులు, బ్యాంక్‌లు సమన్వయంతో పనిచేయాలి

సమావేశంలో హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్



సమావేశంలో మాట్లాడుతున్న నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్

సిటీబ్యూరో, జనవరి 28 (నమస్తే తెలంగాణ): పెరుగుతున్న సైబర్‌నేరాలను అడ్డుకోవడంలో పోలీసులతో పాటు బ్యాంకుల పాత్ర కీలకమని, అందరూ సమన్వయంతో పనిచేయాల్సిన అవసర ముందని నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ తెలిపారు. మంగళవారం సీనియర్ బ్యాంకు అధికారులు, ఆర్‌బీఐ ఆఫీసర్స్, లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలతో ఉన్నత స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో బ్యాంకుల నుంచి ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలకు ఎదురవుతున్న సమస్యలు, వాటిని ఎదుర్కొవడానికి చేయాల్సిన పనులు, మన్మందు సమన్వయంతో పనిసేందుకు స్టాండర్